



జరిగిన జగన్నాటకం

ఎడమచేతిని ప్రముఖంగా వాడే సవ్యలంకలో కుడి చేతిని వాడినందుకు బోసుకు దళాధిపతి మరణదండన విధించబోతే ఆచార్య వేదాంతం, ద్వీప, పశుపాల కలిసి బోసుని కాపాడారు. ద్వీపాన్ని వదిలి వెళ్ళిపోవాలని ప్రయత్నించి విఫలమయ్యాడు బోసు. భవిష్యజ్ఞాన గ్రంథంలో చెప్పబడిన మహాబసు బోసే అని ద్వీప చెప్పింది. దళాధిపతితో జరిగిన పోరాటంలో జలపతి మరణించాడు. అయిష్టంగానే నాయకత్వాన్ని మహాబసుకి ఇచ్చేశాడు ఉగ్ర. సవ్యలంక మహాధినేత వామదేవుడు నూటాఇరవై మంది సత్యోద్యమకారులను హతమార్చడంతో శాంతిపోరాటం సాయుధపోరాటంగా మారింది. అడవిలోకి కుడిచేతి వాటం వున్న రణచండి దేవత విగ్రహాలను చూసి ఆశ్చర్యపోయాడు మహాబసు

# 13

అడవి మధ్యలో ఎక్కడో గుర్తు తెలియని ప్రాంతంలో చెట్ల నీడన స్థిరపడ్డారు మహాబసు, అతని అనుచరులు. పక్కనే చిన్న తటాకం వుండటంతో అక్కడి మంచి నీళ్ళు తాగి, అందుబాటులో వున్న ఫలాలను తిని సేదతీరారు. మహాబసు ఆచార్య వేదాంతం పక్కన చేరాడు.

"ఆచార్యా, ఎడమ చేతినే వాడాలన్న నియమం వున్న సవ్యలంకలో కుడిచేతి వాటం వున్న రణచండి, దేవత ఎలా అయ్యింది?" అన్నాడు. ఆచార్య వేదాంతం ఏదో గుర్తుకు తెచ్చుకుంటున్నట్లుగా కొద్దిసేపు మౌనంగా వుండిపోయాడు.

"రణచండి ఇప్పటి దేవత కాదు. నేను, జలపతి కలిసి చదువుకునే రోజుల్లో జ్ఞాతి, విజ్ఞాతి అని ఇద్దరు గురువులు వుండేవారు. మహామేధావులు. వారు శాస్త్రాలని, చరిత్రని, జ్ఞానాన్ని అధ్యయనం చేసి ఔపోసన పట్టినవాళ్ళు. వాళ్ళు తరచుగా రణచండి గురించి మాట్లాడేవాళ్ళు."

"ఆ వివరాలు నాకు కూడా చెప్పండి గురువర్యా" అన్నాడు మహాబసు వినమ్రతతో. ఆచార్య వేదాంతం అప్పటికే చాలా దూరం నడిచి అలసిపోయి వున్నాడు. కానీ మహాబసు వినయం, జిజ్ఞాస చూస్తే ఆయన చెప్పకుండా వుండలేకపోయాడు. పైగా ద్వీప కూడా వచ్చి చేరడంతో మాట్లాడటం మొదలుపెట్టాడు.

"మహాబసూ, దేవతలు ఎలా ఆవిర్భవించారు అన్న విషయం తెలుసుకోవాలని ప్రయత్నించడమే అనవసర ప్రయాస అనిపిస్తుంటుంది. ఒక ఆస్తికుడిగా ఆలోచిస్తే దేవుడికి దేవతలకి పుట్టుక లేదు చావు లేదు అని వాదించవచ్చు. అసలు అది మిధ్య అనీ, చరిత్రలో ఏదో ఒక సందర్భంలో ప్రత్యేకంగా కనిపించిన వ్యక్తినో, ప్రకృతిలో ఒక భాగాన్నో దేవుణ్ణి చేశారని నాస్తిక వాదన వుండవచ్చు. ఏది ఏమైనా ఆ దేవుడికి సంబంధించి కొన్ని కథలు ప్రచారంలో వుంటాయి. అంటే అవి చరిత్ర కావచ్చు లేకపోతే కల్పిత గాధ కావచ్చు. కానీ ఆ కథలు రకరకాల రూపాలలో ఒకరి నుంచి ఒకరికి, ఒక తరం నుంచి మరో తరానికి వ్యాప్తి చెందుతూ వస్తుంటాయి. ఆ కథలలో వున్న బలం, నమ్మకం కలిగించే శక్తిని బట్టి ఆ దేవతారాధన జరుగుతుంటుంది. అలా ఆ దేవుడి రాజ్యం విస్తరిస్తుంది. ఆ దేవుణ్ణి ధిక్కరించే మరో దేవుడి గాధ వచ్చే వరకూ ఆ రాజ్యం వుంటుంది. ఆ తరువాత అది పతనమై అయిపోతుంది. మరో దేవుడి రాజ్యంగా మారిపోతుంది" అని ఆగాడు

"అవును ఆచార్య. మీరు చెప్పింది అంగీకరిస్తాను" అన్నాడు మహాబసు. మహాబసు అడిగిన ప్రశ్నకి ఆచార్య వేదాంతం చెప్తున్న విషయానికి సంబంధం ఏమిటో తెలుసుకునే ప్రయత్నంలో పడింది ద్వీప.

"అయితే మనం వెనక్కి వెతుక్కుంటూ వెళ్ళాలంటే ఆ కథలే ఆధారం అవుతాయి. కానీ సత్యమనే వెలుగులు చిమ్మే మణి మీద అభిప్రాయాలు, పక్షపాతము, దురభిమానము లాంటి ఎన్నో పరదాలు కప్పేసి వుంటాయి. ఆ పరదాలలో నుంచి ప్రసరించే వెలుగు రకరకాల రంగుల్లో కనిపించడం మొదలౌతుంది. మనం కళ్ళ ముందు కనపడుతున్న వెలుగు వెలుగు కాదని, అది కేవలం ఒక రంగు పరదా అని గుర్తించి, దాన్ని తొలగించి పరికించి చూస్తే మనకి సత్యం జ్యోతకం అవుతుంది" అని ఒకసారి మహాబసు, ద్వీపల వైపు చూసి మళ్ళీ కొనసాగించాడు.

"ఇదంతా ఎందుకు చెప్పానో తెలుసా? రణచండి దేవత కథ చరిత్ర అయితే ఆ దివ్య మణి మీద కప్పేసిన పరదా ఏమిటో చెప్పడం కోసం. ఆ రంగు పరదా పేరు పురుషాహంకారం."

"పురుషాహంకారమా?" అంది ద్వీప.

"అవును. ఒక విషయం గమనించారా? సవ్యలంక రాజధానిలో ఎక్కడైనా రణచండి దేవాలయం చూశావా?"

"లేదు ఆచార్యా" అన్నారిద్దరూ.

"ఒక్క రణచండి మాత్రమే కాదు. నగరంలో ఎక్కడ చూసినా దేవుళ్ళ ఆలయాలే కానీ దేవతల ఆలయాలు మచ్చుకి కూడా కనిపించవు. ఎందుకు? నగరంలో ఎక్కడా లేని దేవత విగ్రహం అడవిలో ఎందుకు వుందంటారు?" అడిగాడు వేదాంతం.

"బహుశా అడవుల్లో మాత్రమే వుండే గిరిజనులు మాత్రమే ఆమెని కొలుస్తారేమో" అనుమానం వెలిబుచ్చాడు మహాబసు.

"కాదు. మీతో ఇందాక నేను ప్రస్తావించిన మా గురువులు జ్ఞాతి, విజ్ఞాతి ఈ విషయాల గురించి మాట్లాడుకుంటుండగా నేను విన్నాను. కొన్ని వందల సంవత్సరాల క్రితం సంగతది. మా గురువుల అనుమానం ప్రకారం, అప్పట్లో ప్రతి ఒక్కరు రణచండి దేవతనే ఆరాధించేవారు. కానీ తరువాత తరువాత ఆమెని ఊరి బయటికి పంపించేశారు. ఎందుకో తెలుసా? అప్పట్లో మా సమాజం మాతృస్వామ్య వ్యవస్థ మీద ఆధారపడి వుండేది. కానీ కాలానుగుణంగా సమాజం మాతృస్వామ్య వ్యవస్థ నుంచి పితృస్వామ్య వ్యవస్థలోకి మారింది. అప్పటి వరకు ఒక కుటుంబంలో స్త్రీ ముఖ్య పాత్ర పోషిస్తుంటే, ఆ మార్పు వల్ల పురుషుడు కుటుంబానికి అధిపతిగా మారాడు. అధికారాన్ని చేజిక్కించుకున్నాడు. స్త్రీలు తక్కువనీ పురుషులు ప్రకృతి సిద్ధంగా గొప్పవారని ప్రచారం మొదలుపెట్టారు."

"మరి ఆ మార్పుని స్త్రీలు ఒప్పుకున్నారా?" అడిగింది ద్వీప

"ఏ మార్పునీ ఎవరూ ఒప్పుకోరు ద్వీపా. కాకపోతే ఇలాంటి మార్పు ఒక్కసారిగా జరగలేదు. క్రమక్రమంగా మొదలై కొన్ని వందల సంవత్సరాలు సాగి వుంటుంది. అన్ని సంవత్సరాల తరువాత మహిళలు ఆ విషయాన్ని తెలుసుకోగలిగారు. అప్పుడు వ్యతిరేకత మొదలైంది. పోరాడటం మొదలు పెట్టారు. పురుషాధిక్యతకి వ్యతిరేకంగా ఇప్పటికీ పోరాటం సాగుతూనే వుంది. పురుషులు కూడా తమని తాము బలమైన స్థితిలో పెట్టుకోడానికి అవసరమైన సిద్ధాంతాలను తయారు చేసుకున్నారు. శాస్త్ర గ్రంథాలను తిరగరాసుకున్నారు. స్త్రీ ఆధిక్యత వుంటే సమాజం పతనమైపోతుందని కథలు కట్టి ప్రచారం చేశారు. అందులో భాగంగానే రణచండి రోగాలకు అధిష్టాన దేవత అనీ, ఆమె ఊరి మధ్యలో వుంటే ఊరంతా రోగాలతో అల్లాడుతుందని కట్టుకథ అల్లారు. వాటికి ప్రచారం కల్పించారు. వాళ్ళ వ్యూహం ఫలించింది. రణచండి గుళ్ళను ధ్వంసం చేశారు. ఆమె విగ్రహాలను పెకలించి ఊరికి దూరంగా పడేశారు. బహుశా ఇప్పుడు మనం చూసిన విగ్రహం కూడా అలా వచ్చినదే అయ్యుంటుంది" అని ముగించాడు.

"అంతవరకు సరే, మరి ఆమె కుడి చేతి వాటం కలిగి ఎందుకు వుంది?" అడిగాడు మహాబసు

"ఆ వివరం నాకు కూడా తెలియదు. కానీ కొంత ఆలోచన చేస్తే ఒక విషయం అర్థం అవుతోంది. బహుశా కొన్ని వందల సంవత్సరాల క్రితం ఈ ద్వీపంలో కుడిచేతి వాడకం అభ్యంతరకరం కాకపోయి వుండవచ్చు. అది మధ్యలో మొదలై వుండవచ్చు"

"మరి శాస్త్రం అలా చెప్పలేదని కదా వాదన?"

"శాస్త్రం మాత్రం ఏ మార్పుకి లోను కాలేదని ఎలా అనుకోగలం?"

"అంటే కుడిచేతి వాటాన్ని తప్పుగా, ఆమోదయోగ్యం కాకుండా చేయడానికి ప్రయత్నం జరిగిందని అనుకోవచ్చా? అలా అయితే ప్రయత్నపూర్వకంగా, బలవంతంగా ఎడమచేతి వాటాన్ని ప్రజలపైన రుద్దబడిందన్న నా అనుమానం నిజమే అయ్యుండచ్చు కదా?"

ఆచార్య వేదాంతం అవునన్నట్లు తలాడించాడు.

"మీరు చెప్పిన చరిత్ర నిజమైతే, ఇదంతా ఒక స్త్రీని పూజించటాన్ని అధిక్షేపించడానికి, అసలు కుడి చేతిని వాడటమే నేరమని ప్రచారం చేసి, అలాంటి కుడి చేతిని వాడే దేవత ధర్మ వ్యతిరేకమని చెప్పి, ఆ దేవతని శాశ్వతంగా తొలగించే పురుషాధిక్య ప్రయత్నం అయ్యుండచ్చు కదా?"

వేదాంతం అతని వైపు అభినందన పూర్వకంగా చూశాడు.

"కావచ్చు. కానీ అది అంత సులభం కాదు. అలాంటి ప్రచారం అధినేతల దగ్గర్నుంచి, అధికారులదాకా, ధర్మాధికారం వున్న దైవ సేవకుల నుంచి, పామరులదాకా అందరి కలిస్తేనే సాధ్యమౌతుంది. కేవలం పురుషాధికార భావనలు వున్న కొంతమంది పురుషులు మాత్రమే చేయగలిగిన పని కాదు. దీని వెనుక ఇంకా ఏదో పెద్ద రహస్యం వుంది" అన్నాడాయన.

ఆ తరువాత ఆయన్ని ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక మహాబసు, ద్వీప అక్కడ్నుంచి లేచి తటాకం ఒడ్డున కొద్ది దూరం నడిచారు.

"ఏదో పరదేశీవని పలకరిస్తే, నిశారణ్యంలోకి తెచ్చి పడేశావు" అంది ద్వీప నవ్వుతూ. మహాబసు కూడా నవ్వేశాడు.

"నేనైతే రమ్మనలేదు."

"వస్తానంటే కాదనలేదు కదా"

"ఎంత దాకా వస్తావో చూడాలని" అన్నాడు.

"నువ్వు రమ్మంటే ఎక్కడిదాకైనా వస్తాను" అంది.

మహాబసు ఆశ్చర్యపోయాడు. ద్వీప తనతో అనుబంధాన్నిపెంచుకోవాలని ప్రయత్నిస్తోందని అతనికి చాలారోజులుగా తెలుస్తూనే వుంది. అయితే అలా అనిపించిన ప్రతిసారీ, తనెవ్వరన్న ప్రశ్న పదే పదే అతన్ని వేధిస్తోంది. ఎక్కడి నుంచో వచ్చాడు. అది ఎక్కడో కూడా తెలియదు. తెలియని ఆ చోటికి తిరిగి వెళ్తాడో లేదో కూడా తెలియదు. అదీ కాక ఇప్పుడు పోరాటంలో మునిగిపోయి వున్నాడు. ఇది ముగిసేది ఎప్పుడో, ఆ ముగింపు ఏ పరిస్థితికి దారి తీస్తుందో తెలియదు. ఇలాంటి అనిశ్చితిలో ఆమెతో అనుబంధాన్ని పెంచుకోవడం, అనవసరమైన ఆశల్ని రేకెత్తించడం సమంజసం కాదేమో అనిపించింది.

"ఏమిటో అంత ఆలోచన" అని ద్వీప అనడంతో తేరుకున్నాడతను. "ఏం లేదు" అని మాత్రం అనగలిగాడు. "ఇక వెనక్కి వెళ్దామా?" అన్నాడు ఆ సంభాషణని ముగిస్తూ.

<><>

మర్నాడు తెల్లవారడమే ఒక కలకలంతో మొదలైంది. అడవిలో వున్నవారి రక్షణ కోసం రాత్రంతా పహారా కాస్తువాళ్ళకి తెల్లవారుతుండగా ఎవరో వారివైపు వస్తున్నట్లుగా అనిపించింది. పరిశీలనగా చూసి ఆ వ్యక్తి తమ వర్గంలో వాడు కాదని నిర్ధారించుకోని వెంటనే మఃఆబసు ప్రధాన అనుచరులలో ఒకరైన సుధామని వర్తమానం పంపించారు. మరో వైపు ఆరుగ్గురు సైనికులు వస్తున్న వ్యక్తిని చుట్టు ముట్టి బంధించారు. అతను ఏ మాత్రం ప్రతిఘటించకపోవటంతో ఆశ్చర్యపోయారు వాళ్ళు.

మరి కొద్దిసేపట్లో సుధామ, అతనితో పాటు పశుపాల అక్కడికి చేరుకున్నారు. వచ్చి పట్టుబడ్డ వ్యక్తిని చూస్తూనే ఇద్దరూ ఆశ్చర్యపోయారు. వచ్చినది — ఉదంతుడు.

సవ్యలంకలో ధర్మాధికారిగా ప్రసిద్ధుడు. సింహాసనానికి విధేయుడు. వేదాంతం, జలపతి వంటి మేధావుల వరుసలో చేర్చగల పేరు ప్రఖ్యాతులు వున్నవాడు. అలాంటివాడు తమని వెతుక్కుంటూ రావటం ఆశ్చర్యకరంగానూ, అనుమానాస్పదంగానూ అనిపించింది సుధామ, పశుపాలలకు. వెంటనే అతణ్ణి తీసుకోని తమ స్థావరాలకు కాస్త దూరంగా వున్న మరో ప్రదేశం దగ్గరకు చేరుకున్నారు. మరోవైపు నుంచి ఈ విషయం తెలుసుకున్న మహాబసు, ఉగ్ర అక్కడికి చేరుకున్నారు. విచారణ ప్రారంభమైంది.

"ఎందుకొచ్చావు?" సూటిగా అడిగాడు మహాబసు.

"మీతో కలవడానికి" ఉదంతుడు కూడా సూటిగానే అన్నాడు.

"నువ్వు సింహాసనానికి విధేయుడవనీ, ధర్మ పరిరక్షణ పేరుతో కుడి చేతిని వాడిన వారికి ఎలాంటి శిక్షలు విధించాలో చెప్పే విధివిధానాలు మీరే తయారు చేశారని విన్నాను. అలాంటి మిమ్మల్ని మాలోకి ఎలా కలుపుకోమంటావు?"

"సింహాసనానికి విధేయత నా ఉద్యోగ ధర్మం. నాకు అప్పగించిన పనులు పూర్తి చేశానే తప్ప, నేను చేసిన ప్రతి పనీ నమ్మి చేసినవి కావు"

"అంటే మీకంటే ఎలాంటి విలువలు, నమ్మిన సిద్ధాంతాలు లేవా? వాటిని కాదనుకోని కేవలం అధికారంలో వున్నవాళ్ళ ఉత్తర్వులు పాటించడం సమంజసమేనా? నిన్ను ఎలా నమ్మడం" స్పష్టంగా సూటిగా ప్రశ్నించాడు మహాబసు.

ఉదంతుడు క్షణంసేపు మాట్లాడకుండా వుండిపోయాడు. ఆ తరువాత స్థిరంగా చెప్పసాగాడు –

"మహాబసూ మానసిక సంఘర్షణ వుందో లేదో పైకి తెలిసేది కాదు. ఆ సంఘర్షణ తీవ్రమైన తరువాత నేను మీతో కలవడానికి వచ్చానని మీరు నమ్మాలి. ఇక్కడికి వచ్చిన తరువాత మీరు నన్ను మీతో కలుపుకుంటారో లేదో తెలియదు కానీ, అనుమానం వస్తే నా ప్రాణాలని తీయటానికి వెనుకాడరని కూడా తెలుసు. అయినా తెగించి వచ్చాను. ఇక మీరు అడిగిన ముఖ్యమైన విషయం. రెండు పరస్పర విరుద్ధమైన సిద్ధాంతాలలో ఒకటి నమ్మడం, రెండొవది ఉద్యోగ ధర్మంగా పాటించడం గురించి. –

నిజమే, నేను అలా చేశాను. కానీ అందుకు కారణం కూడా చెప్తాను. చిన్నప్పటి నుంచి నాకు నేర్పించబడిన ముఖ్యమైన విధి, మహాధినేతకి సింహాసనానికి బద్ధుడినై వుండటం. మహాధినేత ఆదేశాలను సాక్షాత్తు దేవుడి సందేశంగా భావించి అమలుపరచడం. ఇందులో వ్యక్తిగత యుక్తాయుక్త విచక్షణకి అవకాశం లేదు, వుండదు. మీరు దయచేసి అర్థం చేసుకునే ప్రయత్నం చేయండి. చిన్నప్పటి నుంచి నాకు నేర్పించబడిన విలువలలో అత్యంత ప్రధానమైనది అధికారంలో వున్న నాయకుడికి విధేయుడిగా వుండటం, అతని ఆజ్ఞాపాలన చెయ్యడం. ఇది కాక, నేను ఎదుగుతున్న కొద్దీ, అందరికీ జరిగినట్లే, మరెన్నో నమ్మకాలు, విలువలు ఒక్కటిగా వచ్చి చేరాయి. అయితే అధికారం నుంచి వచ్చి ఆజ్ఞ నా నమ్మకాలని ప్రశ్నించినప్పుడు, నా విలువలను పరీక్షించినప్పుడు ఏం చెయ్యాలన్న నిర్ణయం తీసుకోవడం అంత తేలికకాదు. తల నరకమని తలారికి చెప్పడం సులభం. తలారి అధికారి మాట వినాలా? ఒక ప్రాణానికి విలువ ఇచ్చే వ్యక్తిగా వెనుకంజ వెయ్యాలా అన్న నిర్ణయం తీసుకోవడం అత్యంత క్లిష్టమైనది. విలువల మధ్య జరిగే ఈ పోటీలో ఏం చెయ్యాలో నిర్ణయించుకోవడాన్ని బట్టి నా మనసులో ఏ విలువకు ఏ స్థానం వుందో తెలుస్తుంది. ఏ విలువకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామో అర్థం అవుతుంది.

దురదృష్టవశాత్తు, నన్ను పెంచిన విధానం వల్లైతేనేమీ, అయాచితంగా రాజాశ్రయం దొరకడం వల్లైతేనేమీ నా మనసులో వున్న ఇతర నమ్మకాలను, విలువలను ఆజ్ఞాపాలనం అనే విలువ అధిగమించింది. మిగిలిన అన్ని నమ్మకాలని తొక్కి పట్టుకున్నాను. కానీ అవి అలా వుండటానికి అంగీకరించలేదు. పదే పదే తిరగబడ్డాయి. ఆ తిరుగుబాటులన్నీ బాహ్యంలో మానసిక సంఘర్షణలుగా మారాయి. అలాంటి సంఘర్షణలెన్నో జరిగాక క్రమక్రమంగా నేను నమ్మిన సిద్ధాంతాలే అధికారుల ఆజ్ఞల కన్నా ప్రధానమైనవి, అధికమైనవి అన్న భావన రూపుదిద్దుకుంది. అలాంటి భావన వచ్చిన మరుక్షణం నేను ఇంక అక్కడ వుండలేకపోయాను. వెంటనే మీ దగ్గరకు రావాలనీ, మీ ఉద్యమంలో కలిసిపోవాలని నిర్ణయించుకున్నాను. అందుకే వచ్చాను" అంటూ సుదీర్ఘంగా వివరించాడు ఉదంతుడు.

"నువ్వు చెప్పేది నమ్మశక్యంగానే వుంది. కానీ ఒక్క ప్రశ్న – నిన్ను మానసిక అశాంతికి గురిచేసి, రాజ్యాధికారాన్ని ధిక్కరించేలా శాసించిన ఆ నమ్మకం ఎమిటి? ఇప్పుడు నీ మనస్సులో ఏ విలువకి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నావు?" అడిగాడు మహాబసు. ఈ చర్చ సాగుతున్న దిశ ఏమిటో, దాని పర్యవసానం ఏమిటో అర్థం కాక కేవలం వినటమే తమ పని అన్నట్లు చూస్తూ వుండిపోయారు ఉగ్ర, పశుపతి.

ఉదంతుడు ఏదో ముఖ్యమైన విషయం చెప్పబోతున్నట్లు తన గొంతుని సవరించుకున్నాడు.

"స్వతంత్రం" అన్నాడు గట్టిగా. చుట్టూ పరికించి చూసి మళ్ళీ కొనసాగించాడు. "వ్యక్తిగత స్వాతంత్ర్యం. కుడి చేతిని వాడాలా? ఎడమ చేతిని వాడాలా? అన్నది కాదు ప్రశ్న. ఏది వాడాలో నిర్ణయించుకునేందుకు మనకి తెలివితేటలు వున్నాయి. ఆలోచనలు వున్నాయి. పక్కవారి పన పడే ప్రభావం ఆధారంగా కూడా నిర్ణయం తీసుకోవచ్చు. కానీ అసలంటూ నిర్ణయం తీసుకునే అధికారం వుండాలి కదా! అదే వ్యక్తిగత స్వేచ్ఛ! అదే అన్నింటికన్నా ముఖ్యమైన విలువు. దాని కోసం నేను ఈ సాహసం చేస్తున్నాను."

మహాబసు ముఖం ప్రసన్నంగా మారింది

"మిమ్మల్ని సాదరంగా ఉద్యమంలోకి ఆహ్వానిస్తున్నాను. రేపటి నుంచే మీ పని ప్రారంభమౌతోంది. మీరు ఉగ్రతో కలిసి ఇక్కడి దగ్గర్లో వున్న దక్షిణావతం అనే ఊరిని ఆక్రమించాలి. అలా చేస్తే ఈ అడవిలో ఇలా దొంగచాటుగా వుండి పోరాడాల్సిన అవసరం వుండదు. దక్షిణావతం మన చేతికి చిక్కిందంటే ఇక అదే మన పోరాటానికి ప్రధాన స్థావరం అవుతుంది." అని చెప్పి అక్కడ్నుంచి కదిలాడు. ఉగ్ర, పశుపాల, ఉదంతుడు అంతా అతన్ని అనుసరించారు.

అందరి మనసుల్లో రకరకాల ఆలోచనలు రగులుతున్నాయి.

"ఉదంతుడు చెప్పినదాంట్లో ఎంత నిజం వుందో తెలియదు. కానీ అది అబద్ధమై, అతను కేవలం మహాధినేత గూఢాచారిగా వచ్చి వుంటే దాని పర్యవసానం వ్యక్తుల మీదే కాదు పోరాటం మొత్తం మీద వుంటుంది. అలాంటి ప్రమాదం జరగకుండా అతన్ని ఒక కంట కనిపెటాలి" అనుకున్నాడు ఉగ్ర మనసులో

"ధర్మాధినేతగా పేరు కలిగిన ఉదంతుడు రావటం వల్ల ఉద్యమానికి కొత్తఊపిరి వచ్చినట్లైంది" అనుకున్నాడు పశుపాల

"మాటలతో మభ్యపెట్టి ఉద్యమంలో చేరడం వరకు సాధించగలిగాను. ఇక ముందు ముందు ఏం జరుగబోతోందో" అని అనుకుంటూ ముందుసాగాడు ఉదంతుడు.

వీళ్ళందరికంటే ముందు నడుస్తున్న మహాబసు ఆలోచనలు మరో రకంగా సాగుతున్నాయి. అతనికి ఉదంతుడి మాటలు మళ్ళీ మళ్ళీ జ్ఞాపకానికి వస్తున్నాయి –

"విలువల మధ్య జరిగే ఈ పోటీలో ఏం చెయ్యాలో నిర్ణయించుకోవడాన్ని బట్టి నా మనసులో ఏ విలువకు ఏ స్థానం వుందో తెలుస్తుంది. ఏ విలువకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామో అర్థం అవుతుంది."

మరుక్షణం మహాబసు మనసులో మరో ఆలోచన మొదలైంది – "నేను నమ్మి పాటిస్తున్న సిద్ధాంతం ఏమిటి? నేను నమ్మిన విలువలలో అత్యంత ప్రధానమైన విలువ ఏది?"

(జరగబోయే జగన్నాటకం వచ్చే మాసం)

COMMENTS